క్లుప్తంగా

మోడల్‌స్కూళ్లకు హెచ్‌ఎంల నియామకం

ఉయ్యాలవాడ: మండలంలోని నాలుగు మోడల్ ప్రైమరీ పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను నియమించినట్లు ఎంఈఓ రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల జిల్లాలో జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా ఉయ్యాలవాడ రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలకు రూపనగుడి పాఠశాల నుంచి శ్రీనివాసరెడ్డి, ఇంజేడుకు కొండుపల్లె నుంచి హేమలత, బోడెమ్మనూరుకు ఆళ్లగడ్డ పేరాయిపల్లె నుంచి రమణయ్య, హరివరంకు ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు నుంచి జయభారతిని హెచ్‌ఎంలుగా నియమించినట్లు పేర్కొన్నారు.

లారీ డ్రైవర్‌పై కేసు నమోదు

శిరివెళ్ల: రోడ్డు ప్రమాదానికి కారకుడైన మహారాష్ట్రకు చెందిన గజానన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య సోమవారం తెలిపారు. ఈ నెల 8వ తేదీన నంద్యాల- ఆళ్లగడ్డ జాతీయ రహదారిపై యర్రగుంట్ల విమలా పాఠశాల మలుపు వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధునికి లారీ ఢీకొనింది. ఈ ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన విషయం విదితమే. నంద్యాల నుంచి ఆళ్లగడ్డ వైపు వెళ్తుండంగా ఈ ప్రమాదం జరిగింది. కాగా వృద్ధుడి చిరుమానా కోసం అన్వేషిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

హెచ్‌ఎంగా వెంకటరమణ

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలోని శ్రీకన్యకా పరమేశ్వరీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా వెంకటరమణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అక్కడ హెచ్‌ఎంగా ఉన్న సుబ్బరాయుడును విద్యాశాఖ ఉన్నతాధికారులు చాగలమర్రి మండలం చింతల చెరువుకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీశైలం నుంచి వెంకటరమణను నియమించారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): ఈ విద్యా సంవత్సరం (2024-25) పదవతరగతిలో ఉత్తీర్ణత సాధించిన ముస్లిం మైనార్టీ విద్యార్థులకు రూ.3000 చొప్పున స్కాలర్‌షిప్ ఇస్తున్నట్లు అంజుమన్ సంస్థ అధ్యక్షుడు నశ్యం అబ్దుల్ ఖుద్దూస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉన్నత విద్య కోసం ఈ సాయం అందించనున్నట్లు వెల్లడించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా గల అంజుమన్ సంస్థలో ఉచితంగా లభించే దరఖాస్తు ఫారంలో పూర్తి వివరాలు నింపి 10వ తరగతి మార్క్ లిస్ట్, స్టడీ సర్టిఫికెట్, కళాశాలలో చేరిన ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు జత చేసి జూన్ 30లోపు పూర్తి చేసిన దరఖాస్తులను సమర్పించాలన్నారు. మరిన్ని వివరాల కోసం సెల్: 98662 42724 సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేద్దాం

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు అన్నారు. ఈ నెల 12న రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నంద్యాల జిల్లా పర్యటన నేపథ్యంలో సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు చింతలయ్య అధ్యక్షతన పార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలి

గోస్పాడు: విద్యుత్ బిల్లులు వినియోగదారుల నుంచి సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞానసూర్యుడు అన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో సోమవారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని సూచించారు. ఎవరైనా బిల్లులు చెల్లించకపోతే కనెక్షన్లు తొలగించాలని, ఎక్కడైనా విద్యుత్ మీటరు లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయండి

నంద్యాల(న్యూటౌన్): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు ఎంపికైన విద్యార్థుల వివరాలు కేంద్ర మానవ వనరుల శాఖ న్యూఢిల్లీ వెబ్‌సైట్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీ ఆధారంగా జారీ చేయబడిన 14 అంకెల సంఖ్య ఎన్‌ఎస్‌పీలో స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేయడానికి ఓటీఆర్ అవసరమన్నారు. పూర్తి వివరాలకు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ www.scholarships.gov.in లేదా ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్‌లో పొందాలన్నారు.

ఆలయ భూములకు వేలం

నంద్యాల(వ్యవసాయం): కోటవీధిలోని బ్రహ్మానందీశ్వర దేవస్థానం ఆలయ భూములు, రూముల అద్దెకు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఇందులో ఆలయానికి అధిక ఆదాయం లభించినట్లు ఈఓ ఉన్నం లక్ష్మీనారాయణ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 9.79 ఎకరాలకు మూడు సంవత్సరాలకు గాను పాత గుత్త రూ.1,50,500 కాగా, కొత్తగుత్త రూ.2.48 లక్షలు పలికిందన్నారు. అద్దె రూములు మూడు సంవత్సరాలకు గాను రూ.16,850 పలకగా గతంతో పోల్చితే నెలకు రూ.2,450 ఆదాయం లభించినట్లు వారు తెలిపారు. ఈ వేలం పాట కార్యక్రమంలో మూలసాగరం ఈఓ వి.గోపి, ఆలయ అర్చకులు మురళీకృష్ణ, సురేష్, రాజ్యలక్ష్మి, ప్రసాద్, వేణుగోపాల్, దండే సుధాకర్, తదితర పాటదారులు పాల్గొన్నారు.

జ్వరభద్రం

- వర్షాకాలంలో స్వైర విహారం చేయనున్న దోమలు
- డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ప్రబలే అవకాశం
- పరిశుభ్రతతోనే దోమలకు చెక్
- ఈనెల 30 వరకు జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవం



గోస్పాడు: ఇటీవల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పట్టణాలు, గ్రామాల్లో సీజన్ వ్యాధులు ప్రబలుతున్నాయి. తగిన జాగ్రత్తలు పాటించకపోతే వీటితో పెద్ద ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు సంక్రమిస్తున్న వేళ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత అనేవి ఎంతో ముఖ్యం. వీటి విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా తీవ్ర అనారోగ్య పాలు కావల్సి వస్తుంది. వీటిల్లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటివి మరింత ప్రమాదకరంగా మారుతాయి. అందుకే వీటి విషయంలో ఎంతో జాగ్రత్త అవసరం. చిన్నపాటి జ్వరం వచ్చినా నిర్లక్ష్యం చేయకూడదు. ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేస్తూ మలేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు ఈనెల 1 నుంచి 30 వరకు జాతీయ మలేరియా వ్యతిరేక మాసోత్సవాన్ని అధికారులు నిర్వహిస్తున్నారు.

జిల్లాలో గత నాలుగేళ్లుగా మలేరియా కేసుల వివరాలు ఇలా..

సంవత్సరం	పరీక్షలు చేసిన వారిసంఖ్య	నమోదైన కేసులు
2022	3,32,301	8
2023	3,83,411	28
2024	4,43,066	8
2025 (ఇప్పటి వరకు)	2,00,754	4

మలేరియా లక్షణాలు...

మలేరియా వ్యాధి అనాపిలిస్ అనే దోమ కాటు వల్ల వస్తుంది. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందువల్ల ఈ వ్యాధి ప్రబలే అవకాశం ఉంది. చలి, వణుకుతో కూడిన విపరీతమైన జ్వరం, ఒళ్లు నొప్పులు, జ్వరం రోజు మార్చి రోజు, రెండు మూడు రోజులకు ఒకసారి వస్తుంటుంది. మలేరియాలో వైవ్యాక్స్ మలేరియా తక్కువ బాధిస్తే, ఫాల్సీ ఫారం మలేరియా ఎక్కువ బాధించడమే కాకుండా ఒక్కోసారి ప్రాణాంతక స్థాయికి చేర్చుతుందని వైద్యులు చెబుతున్నారు.

నిర్ధారణ ఇలా...

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో మలేరియా నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణను గంట వ్యవధిలోపు చేసే అవకాశం ఉంది. రక్త నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ జరిగితే అందుకు అవసరమైన మాత్రలను అందిస్తారు. నిర్దేశించిన గడువు ప్రకారం మందులను క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. అందుకు అవసరమైన మందులన్నీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు ఉచితంగా లభిస్తాయి.



మురుగునీరు నిల్వపై సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే..

- దోమ పుట్టనివ్వకూడదు, కుట్టనివ్వ కూడదు.
- ఇంటి కిటికీలు, తలుపులు, లెట్రిన్ పైపునకు మెష్ ఏర్పాటు చేయాలి.
- రాత్రి సమయాల్లో దోమతెరలను వినియోగించుకోవాలి.
- సాయంత్రం నుంచి శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు వేసుకోవాలి.
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- తాగునీటి నిల్వలపై మూతలు వేయాలి.
- వాడుకలో లేని సామగ్రిని బోర్లించి ఉంచాలి.
- ఇంటి పరిసరాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- మురికి నీటిపై వేస్ట్ ఆయిల్, కిరోసిన్ పోయాలి.
- ఇంటి పరిసరాల్లో టైర్లు, తాగిపారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు లేకుండా చూడాలి.
- ఇంటి ఆవరణలో దోమ వికర్షణాలైన బంతి, తులసి, పుదీనా, లావెండర్, రోజ్ మేరీ వంటి మొక్కలు పెంచుకోవాలి.

ప్రజలను చైతన్య పరుస్తున్నాం



వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. దోమల వల్ల మలేరియా, ఇతర విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు వైద్యసిబ్బంది ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాం. వ్యాధి నివారణ అనేది మనం తీసుకొనే జాగ్రత్తలపై ఆధారపడి ఉంటుంది. పరిసరాల్లో మురికినీరు లేకుండా చూసుకోవాలి.

– డాక్టర్ కామేశ్వరరావు, జిల్లా మలేరియా నివారణ అధికారి, నంద్యాల

దోమలు కుట్టకుండా చూసుకోవాలి



జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో మలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేసి మందులను కూడా ఉచితంగానే అందిస్తున్నాం. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని ఆసుపత్రుల్లో అడ్మిట్ చేసి వైద్యం అందిస్తున్నాం. ప్రజలు ముందు జాగ్రత్తగా దోమలు కుట్టకుండా చూసుకోవాలి. ఇందుకు తీసుకోవాల్సిన చర్యలపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ వెంకటరమణ, డీఎంహెచ్‌ఓ, నంద్యాల

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు



ప్రతిభ పురస్కారం అందుకున్న చాగలమర్రి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు

శిరివెళ్ల/చాగలమర్రి: ఈ ఏడాది మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సోమవారం జిల్లా కేంద్రం నంద్యాలలో అవార్డులు అందజేశారు. శిరివెళ్ల మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి గుమ్మ కావ్య 600 మార్కులకు గాను 587 మార్కులు సాధించడంతో పురస్కారం అందజేసి అభినందించారు. అలాగే చాగలమర్రి మండలంలో ఆరుగురు విద్యార్థులు ఈ అవార్డులు అందుకున్నట్లు ఎంఈఓలు అనురాధ, న్యామతుల్లా తెలిపారు. మండల కేంద్రమైన చాగలమర్రిలోని శ్రీచైతన్య భారతీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పోన్నంపల్లి అంబికా శ్రీ, కనిష్ తేజ, మద్దూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని షేక్.షహన, చాగలమర్రిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు మంచికంటి గాయిత్రి, పఠాన్ ఐజా ఆలీ, రాఘవేంద్ర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి శైలజ అవార్డులు అందుకున్న వారిలో ఉన్నారన్నారు. వీరికి జిల్లా అధికారులు రూ.20 వేల నగదు బహుమతితో పాటు మెమొంటో, ప్రశంసా పత్రం అందజేసినట్లు వెల్లడించారు. అలాగే మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఉన్న బర్డ్స్ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థిని కందుల శరణ్య జిల్లా స్థాయి షైనింగ్ స్టార్స్ ప్రతిభ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ పాల్ రాజారావు తెలిపారు.

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాల, కళాశాలకు చెందిన సంధ్యా రాణి, సాయితేజ యాదవ్, సాంబశివ నాయక్ అనే ముగ్గురు విద్యార్థులు పదవ తరగతి, ఇంటర్‌లో మంచి ప్రతిభ కనబరచి షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డులు అందుకున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(న్యూటౌన్): యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం నుంచి ఇండోర్ స్టేడియం వరకు నిర్వహించిన యోగాంధ్ర ర్యాలీని జాయింట్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ శరీరం, మనస్సును ఏకీకృతం చేసే ఒక సంపూర్ణ వ్యాయామం యోగ అని చెప్పారు. జిల్లాలో యోగ పట్ల ఆసక్తి ఉన్న వారి పేర్లను రిజిస్టర్ చేయడంతో పాటు మాస్టర్ ట్రైనర్స్ ద్వారా యోగాలో జిల్లా, మండల, గ్రామ స్థాయిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రాల వద్ద భక్తులను యోగ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయనున్నట్లు తెలిపారు. ర్యాలీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, మెడికల్ అధికారి ఆయుష్, సీనియర్ మెడికల్ అధికారి యశోదర తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలో సోమవారం వివిధ శాఖల ఉద్యోగులు యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ యోగాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించామన్నారు. యోగాసనాలు వేయడం ద్వారా ఆరోగ్య పరంగా మంచి ఫలితాలు ఉంటాయని వివరించారు. యోగాసనాలపై మక్కువ పెంచుకొని ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేలా దిశా నిర్దేశం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రహ్మణ్యం, ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవి, మేజర్ పంచాయతీ ఈఓ సుబ్బారావు, గ్రామ సచివాలయాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): ప్రతి రోజు యోగా చేస్తే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ సుగుణశ్రీ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నంద్యాల మండలం రాయమాల్పురం గ్రామంలో గ్రామస్తులకు యోగాంధ్రపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉదయం యోగాసనాలు చేస్తే ఉత్సాహంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్, ఈఓఆర్‌డీ జ్యోతి, ఏఈ శంకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలి



గాంధీచౌక్‌లో ధర్నా చేస్తున్న కార్మిక నాయకులు

నంద్యాల(న్యూటౌన్): విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీచౌక్ సెంటర్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ల నాయకులు నాగరాజు, మురళీధర్, లక్ష్మణ్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని కూటమి సర్కార్ స్పష్టంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే తొలగించిన 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ కోసం విశాఖలో 32 మంది యువకులు పోరాటం చేసి ప్రాణాలు విడిచారన్నారు. అయితే, బీజేపీ ప్రభుత్వం ప్లాంట్‌పై రోజుకో విధంగా ప్రకటన చేస్తూ ప్రజలను తప్పు దోవ పట్టిస్తుందని మండిపడ్డారు. . గనులను కేటాయించకుండా స్టీల్‌ప్లాంట్లను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రపన్నుతుందన్నారు. ఈ ప్లాంట్‌ను కాపాడుకునేందుకు వామపక్ష నాయకులు పెద్ద ఎత్తున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలవెంకట్, వెంకటలింగం, శ్రీనివాసులు, సుశీలమ్మ, సావిత్రి, సుబ్బారావు, జైలాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాసింజర్ రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలి



నంద్యాల రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): కరోనా సమయంలో రద్దయిన ప్యాసింజర్ రైళ్లను తక్షణమే పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్ పేర్కొన్నారు. సోమవారం నంద్యాల రైల్వే స్టేషన్ వద్ద సీపీఐ కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాజర్, ఉమ్మడి జిల్లా మాజీ ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మురళీధర్ మాట్లాడుతూ కర్నూలు నుంచి విజయవాడ, విశాఖ పట్నంకు రైళ్లు నడిచేవని చెప్పారు. కరోనా సమయంలో వాటిని రద్దు చేసి నేటికి పునరుద్ధరించలేదన్నారు. పాలకులు స్పందించి రైళ్ల రాకపోకలను పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సంజీవులు, సామేలు, హరినాథ్, సుశీలమ్మ, విష్ణు, సోమన్న తదితరులు పాల్గొన్నారు.

జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): స్వర్ణాంధ్ర-2047 విజన్ సాకారానికి జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని మైనారిటీ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్‌ను జిల్లా కలెక్టర్ రాజకుమారితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ పేదరికం లేని సమాజం, ఉద్యోగ కల్పన, నైపుణ్యం-మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, అంతర్జాతీయ స్థాయి లాజిస్టిక్స్, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు-బ్రాండింగ్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్.. ఇలా 10 ప్రధాన సూత్రాలతో స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించనున్నట్లు తెలిపారు. ఇందుకు గాను ప్రతి నియోజకవర్గంలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, సీపీఓ వేణుగోపాల్ తదితరులు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

చాగలమర్రి: దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.శివచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు పీహెచ్‌సీ పరిధిలో గిరిజన ప్రాంతమైన ఓజీ తండాలో సోమవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి జి.వెంకటేశ్వర్లు, సీహెచ్‌ఓ బి.క్రిష్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్ రాముడు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రారంభమైన శిక్షణ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్‌సీసీ కంబైండ్ అన్యువల్ శిక్షణ శిబిరాన్ని సోమవారం 9వ ఆంధ్ర గరల్స్ బెటాలియన్ కల్నల్ జోబీఫిలిప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ శిక్షణలో 595 మంది పాల్గొన్నారన్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో మెలిగి దేశభక్తి భావాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్లు హరిత, మౌలాబీ, హేమ, దుర్గా, పద్మావతి, లక్ష్మి, శివగంగ, ఆంధ్రగరల్స్ బెటాలియన్ సిబ్బంది సుబేదర్, బాషా, ధర్మేంద్రకుమార్, దీప్తిసింగ్, భువనచంద్ర, భూపాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నమ్మాళ్వార్ తిరునక్షత్ర తిరుమంజనం



తిరుమంజన సేవలో కొలువైన ఉత్సవమూర్తు మూర్తులు

ఆళ్లగడ్డ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అహోబిలంలో నమ్మాళ్వార్ తిరునక్షత్ర తిరుమంజనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. నమ్మాళ్వార్ తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం దిగువ అహోబిలంలో నిత్యపూజల అనంతరం ఉత్సవ మూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రహ్లాదవరదస్వాములతో పాటు నమ్మాళ్వార్లను యాగశాలలో కొలువుంచి నవకలశ స్థాపన అనంతరం పంచామృతాలతో అభిషేకించారు. అనంతరం తిరుమంజనం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను పల్లకీపై ఆలయ తిరువీధుల్లో ఊరేగించారు.

బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలి

నంద్యాల(న్యూటౌన్): యువతను పెడదారి పట్టిస్తున్న బెట్టింగ్ యాప్‌లను వెంటనే నిషేధించాలని ఏఐవైఎఫ్ నాయకులు జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు, జిల్లా అధ్యక్షుడు రణత్ మాట్లాడుతూ ఐపీఎల్ మ్యాచ్‌ల ద్వారా కార్పొరేట్ సంస్థలు, ప్రముఖ క్రీడాకారులు బెట్టింగ్‌యాప్‌లకు ప్రోత్సహిస్తూ యువతను బలి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు విష్ణు, హరికృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

కలంపై దాడి తగదు

- సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్ట్ దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మలసత్రం: కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ ప్రశ్నించే వారిపై దాడులు, కేసులతో వేధిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్ మండిపడ్డారు. ఎన్నికల హామీల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు చౌకబారు రాజకీయం చేస్తుందన్నారు. కలం దాడి కూడా అందులో భాగమేనని చెప్పారు. దీనిని ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే శిల్పారవిచంద్రకిషోర్ రెడ్డి స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. హామీలు అమలు చేయమని ప్రశ్నించిన ప్రతి పక్షనేతలపై కేసు నమోదు చేయటంలో సర్కారు ముందుందన్నారు. రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా చర్యలు తీసుకోవడంలో చంద్రబాబు సర్కారు విఫలమైందన్నారు. జిల్లా పార్టీ అధికార ప్రతినిధి మాట్లాడుతూ సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు అమరావతిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయకపోయినా అరెస్టు చేయడం తగదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించడం లక్ష్యంగా సర్కారు పనిచేస్తుందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు డాక్టర్ శశికళారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నందికొట్కూరులో బాలిక హత్య నుంచి నిన్న సత్యసాయి జిల్లాలో జరిగిన అఘాయిత్యాల వరకూ కేసుల్లో ఎలాంటి పురోగతి లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయటంలో ఉన్న శ్రద్ధ మహిళలపై జరిగే అఘాయిత్యాలపై లేదని చెప్పారు. సమావేశంలో జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాషా, సెక్రటరీ శీలం శివనాగిరెడ్డి, మున్సిపల్ వింగ్ అధ్యక్షుడు టీవై శివయ్య, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు కారు రవికుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మను దర్శించుకున్న ఎస్వీ దంపతులు



దొర్నిపాడు: డబ్ల్యూ గోవిందిన్నెలో జరిగిన మూల పెద్దమ్మ దేవరలో వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి, తనయుడు ఎస్వీ జనక్‌రెడ్డి కుటుంబ సమేతంగా వచ్చి పెద్దమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వీరి వెంట వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పెద్దమ్మ దేవర

ప్రజలు, భక్తుల సహకారంతోనే డబ్ల్యూ గోవిందిన్నెలో పెద్దమ్మ దేవరను ప్రశాంతంగా నిర్వహించామని డీఎస్పీ ప్రమోద్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా దేవర జరిగిందన్నారు. సహకరించిన ఆలయ కమిటీ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పీహెచ్‌సీ తనిఖీ

రుద్రవరం: స్థానిక పీహెచ్‌సీని సోమవారం డీఐఓ జోషిబాబు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వైద్య సిబ్బందితో మాట్లాడారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ వందన యోజన కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులను పిలిపించి వైద్య పరీక్షలు చేయాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారిణి శ్రావణి, వైద్య సిబ్బంది ఉన్నారు.

పంటల సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటించాలి



శాస్త్రవేత్త వెంకటేశ్వర్లుతో రైతులు

నంద్యాల(అర్బన్): పంటల సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం నంద్యాల మండలంలోని భీమవరం, బిల్లలాపురం గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుత పంటల సాగులో రసాయన ఎరువుల మోతాదును తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. విత్తనశుద్ధి చేసిన తర్వాతే అన్ని రకాల పంటలు సాగు చేపట్టాలని చెప్పారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న వివిధ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవీకే శాస్త్రవేత్త సుధాకర్ ఖరీఫ్ ముందు రైతులు సన్నద్ధత కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ డీడీఏ చెన్నయ్య, ఆత్మ బీటీఎం ఉమామహేశ్వరి, ఏఈఓలు మణిమోహన్‌రెడ్డి, మహేష్, శివనాయక్, చక్రధర్, అనూష, రైతులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

నంద్యాల(అర్బన్): జిల్లా కేంద్రంలో పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల వద్ద ఉన్న మొత్తం పొగాకు కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు కోరారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అలయన్స్-1, జీపీఐ, ఎంఎల్, ఐటీసీ లాంటి కంపెనీలు ముందస్తుగానే క్వింటాకు రూ.15 వేల నుంచి రూ.18వేలు ధర ఇస్తామంటూ ఒప్పందం చేసుకొని పంట చేతికి వచ్చిన తర్వాత కొనుగోలు చేయకుండా నాణ్యత పేరుతో ధరలో కోత విధిస్తూ ఎకరాకు నాలుగైదు క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసి రైతాంగాన్ని నిలువునా ముంచారన్నారు. కేఎఫ్‌సీ రకం పొగాకు జిల్లాలో ఒక్క క్వింటా కూడా కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు బొజ్జన్న, సుబ్బనర్సయ్య, పెద్ద పుల్లయ్య, సుబ్బరాయుడు, సుందరయ్య, కృష్ణమూర్తి, కాశి, తదితరులు పాల్గొన్నారు.